# దేవాలయ సందర్శనము

రచన : జి. శ్రీ కృష్ణారావుగారు

సాయంత్రము సుమారు 5 గంటలయి వుంటుంది. వేసవి కావటాన సూర్యాస్తమయమున కింకా రెండు గంటలు వ్యవధి వున్నది. అందుచేతనే కాబోలు సుదర్శనరావు బయటకు పోయే సన్నాహము ఆరంభించక మేడపైన హాల్లో పడక కుర్చీలో పడుకుని "స్వామి రామ తీర్థ" అనే పుస్తకము తదేక ధ్యానముతో చదువుతున్నాడు. సుదర్శనుడు అప్పుడే బి. ఏ. పరీక్ష ప్రథమ శ్రేణిలో వుత్తీర్ణుడై ఎప్పుడు శలవలు ఐపోతయ్యా ఎప్పుడు ఎమ్. ఎ. లో చేరుదామా అని ఉబలాటపడుతున్నాడు. అతనికి మత సంస్కరణము సందు ఆస్త. సంస్కర్తల జీవిత గ్రంధాలను చదవటమే కాక స్వయముగా సంస్కరణ చేయాలని కోరిక.

రామశాస్త్రి మేడ మెట్లు నిశ్శబ్దముగా ఎక్కివచ్చి పడక కుర్చీ వెనక నిల్చుని సుదర్శనుడు వెనుకకు తిరిగి చూడక పోతాడా అని నిరీక్షిస్తున్నాడు. ఇరుగుపొరుగు వారు కావటము చేత ఒకే కళాశాలలో చదువుతువుంటాన వాళ్లిద్దరికి చాలస్నేహము. రామశాస్త్రికి పూర్వాచారము లంటే మితిలేని నమ్మకము. అసలుమనిషే పూర్వాచారాలు మూర్తీభవించినట్లుంటాడు. పూర్వులు శాసించినదంటే యే విషయమైనా సరే ఎదురు ప్రశ్న వేయక, విమర్శించక, దానిని 'తు, చ,' తప్పకుండ ఆచరిస్తాడు. సుదర్శనరావు తల ఎత్తక పోవటము చూచి రామశాస్త్రి నిరాశచెంది తానే చివరికి "సుదర్శనం! నేను వచ్చి పది నిమిషాలైంది నేను చూస్తువుండగా ఆరు పుటలు తిప్పావు. ఇంకా నా వైపు మాడనేలేదు. ఇక ఆ పుస్తకము కట్టిపెట్టి, బయటికి పోదామురా" అన్నాడు.

పుస్తకము మూసి సుదర్శనము "నీవు వచ్చావని నాకెల్లా తెలుస్తుంది? మేడ మెట్లమీద పిల్లిలాగ చప్పుడు చేయకుండ వచ్చినట్లున్నావు. సరే రావటానికి నాకేమి అభ్యంతరం లేదు. కాని ఎక్కడికి పోదాం? అదేదైనా ఆలోచించావా?" అన్నాడు.

రామశాస్త్రి—ఆలోచన ఏమిటి? ఇవాళ శుక్రవారం కాదూ. అందుచేత గుళ్ళోకి వెళదాము. నేనప్పుడే గుడికి వెళ్లి వారము రోజులయింది. మా అమ్మకూడ ఇవాళ కొన్ని కొబ్బరికాయలు కొట్టి రమ్మనమన్నది. ఏం, నీకు గుడికి రావటము ఇష్టమేనా?

సుదర్శనం—అబ్బ! ఎంత సున్నితముగా అడుగుతున్నావు ఇష్టమేనా అని. దేవుడిని ప్రార్థించటము నాకెప్పుడు అయిష్టము కాదు. కాని ఎటువచ్చీ చెప్పేదేమిటంటే దేవుడిని ఎక్కడైనా ఎప్పుడైనా ప్రార్థించవచ్చు. గుళ్ళోకి వెళ్లి శుక్రవారమునాడే ప్రార్థిస్తే ఎక్కువ పుణ్యము వస్తుందనుకోవటము నా మతము కాదు.

రామశాస్త్రి—అయితే నీవు చెప్పేదేమిటి, రావన్నమాటేనా?

సుదర్శనం—అట్లా అని నేనన్నానా? శుక్రవారము గుళ్ళో జన సమ్మర్ద మెక్కువగా వుంటుంది. అందుచేత నీవు ఏ వుద్దేశముతో గుడికి వెళ్తున్నావో అది నెరవేరనే నెరవేరదు. జనము తోపిడిలో నీవు ప్రార్థించే దేమిటి? అదీగాక మన వూరి గుడి గర్భాలయము మరీ ఇరుకు అన్నట్లు. ఇరుకంటే నాకొక సంగతి జ్ఞాపకము వస్తున్నది.

రామశాస్త్రి—క్రిందకు రా ముందు. పోతూ పోతూ ఎన్ని సంగతులైనా మాట్లాడుకోవచ్చు.

ఇంక విధిలేక సుదర్శనరావు పుస్తకము మూసిపెట్టి బయట వెళ్లటానికి కావలసిన హంగామా అంతా పూర్తి చేశాడు. ఇద్దరు రోడ్డు మీదికి వచ్చారు.

రామశాస్త్రి—ఏమిటి యిందాక చెపుతువున్నావు?

సుదర్శనం—చూడు ఇంకా కావలసినంత వేళవుంది. ముందు అట్లా బీచికి పోయి అక్కడ కొంచము సేపు కూర్చుని తరువాత గుడి సంగతి ఆలోచింతాము.

# దేవాలయ సందర్శనము

రామశాస్త్రి—ఆలోచన యేమిటి నీవు వచ్చినా రాక పోయినా నేను మాత్రము గుడికి వెళ్లక తప్పదు. ఏదో యింకా వేళవుందన్నావు కాబట్టి సరే ముందు బీచికి వెళదాము.

ఇద్దరూ మైలాపూరు బీచికి వెళ్లి నీళ్ల వొడ్డున కూర్చున్నారు.

సుదర్శనం—ఇంతకు ఇందాక గర్భగుడి యిరుకంటే నాకు జ్ఞాపకము వచ్చిన దేమిటంటే, 5 ఏళ్ల నాడు నేను గుడికి వెళ్లటము కథ. నాకు పదిహేనేళ్లువుంటవి. ఆ రోజు సంక్రాంతి పండగ. మా నాన్నగారు నన్నూ మా తమ్ముడిని శివాలయానికి తీసుకు వెళ్లారు. పండగ రోజు కావటాన, దేవాలయము ప్రసిద్ధిచెందినది కావటాన అక్కడ జనము తండోపతండాలుగా వున్నారు. దారికి అటూ యిటూ గుడ్డలు పరుచుకుని ముష్టివాళ్లు కూర్చుని వున్నారు. పక్కన కొబ్బరి కాయలు, అరటిపళ్లు అమ్మే వాళ్ల చిన్న చిన్న దుకాణాలు లెక్కలేకుండ వున్నవి. మేము కష్టపడి ఆవరణలోకి ప్రవేశించాము. ప్రదక్షిణాదులుకూడ పూర్తి అయినవి. దేవుడు వుండే గర్భగుడి చాల లోపలగా వున్నది. ఒక అరగంట శ్రమపడి యెట్లాగో నెమ్మదిగా లోపలికి చేరుకున్నాము. లోపలి జనము వెనుక్కు తోస్తున్నారు. బయటి జనము లోపలికి తోస్తున్నారు. ఊపిరాడటము లేదు. అంతా నూనె మడుగులు. అరటిపళ్ల గుజ్జుమయం. చాలసేపటికి పూజారిని ప్రసన్నము చేసుని మా పూజ అయిందనిపించాము. ఆయన కసురుకుంటూ నెత్తిన శఠగోపము పెడితే ధన్యులమైనామని అనుకుంటూ వెనక్కు తిరిగాము. సింహద్వారము దగ్గర మరీ గుంపు ఎక్కువగావుండి తొక్కులాటగా వున్నది. పద్మవ్యూహము జ్ఞాపకము వచ్చింది ఇంతలో నా వెనక పక్కగా నడుస్తున్న నాలుగేళ్ల పిల్లను ఎవరు తోశారో యేమో పాపము ఆపుకోలేక పడిపోయింది. పడటములో తల గోడకు కొట్టుకుంది. చాల పెద్దగాయం తగిలింది తలకు. ఆ దృశ్యముతో నా మనసు వికలమై పోయింది. అందుచేత నేను అప్పటి నుంచి గుడికి పోను. ఇట్లా అంటున్నానని నేను నాస్తికుడిననుకునేవు సుమా. దేవుని యందు నాకు అమితమైన భక్తి వున్నది. అంతకు మించిన నమ్మక మున్నది. గాంధీ మహాత్ముడు అన్నట్లు భగవత్ ప్రార్థనలో మహత్తరమైన శక్తి వున్నది. అందుచేత నేను ప్రతి రోజు తప్పక భగవద్ధ్యానము చేసుకుంటాను. కాని యిట్లా జన సమూహములో దేవుడి విగ్రహమైనా కనపడని సందర్భాల్లో గుడికి వెళ్లటము వట్టి పటాటోపమని నా భావము. మనసు భగవంతునిమీద వుండలేని పరిస్థితులలో చేయించే పూజవ్యర్థం.

రామశాస్త్రి—సుదర్శనం! తరుచు గుడికి వెళ్లే నాకుకూడ ఈ భావమే స్ఫురించింది కాని అట్లా అనుకోవటము అపచారమవుతుందేమోనని నేను ఎవరికి చెప్పలేదు. ఇప్పుడు నాకు తెలివి వచ్చింది. మన పూజారులుకూడ కళ్లు తెరిచి దేవాలయలను పరిశుభ్రముగా వుంచి భగవంతుడిని యిరుకు గర్భగుడిలో బంధించక విశాల ప్రదేశములో ఆరాధించేట్లు చూడాలి. దానికి నేను కూడ కృషి చేస్తాను. అప్పటివరకు మనసులోనే నిర్మల భావముతో భగవంతుడిని తలుచుకుంటువుంటాను.

రామశాస్త్రి దృష్టి వెనకనుంచి వస్తున్న వృద్ధ అంగవిహీనుని మీద పడ్డది. వెంటనే జేబులోనికి చేయిపోనిచ్చాడు. అందులోనే తృప్తి కనిపించింది అతనికి.

★